కథ

"ఏయ్.. ఎవర్నువ్వు? ఏం కావాలి?" అరిచింది పూజ తనయింటి ముందు నిలబడి అటూ యిటూ దిక్కులు చూస్తున్న ఆగంతకుణ్ని గద్దిస్తూ.

అతనేమీ మాట్లాడలేదు.

బైక్ స్టార్ట్ చేయిబోతుంటే, ఎందుకో అనుమానం వేసి, గబగబా బాల్కనీ దిగి, గేటు వరకు వచ్చేసింది. "ఆగు!" అంది గట్టిగా.

అతను బైక్ స్టార్టు చేయకుండా ఉండిపోయాడు. అప్పుడే విరబూసిన గులాబీలా ఫ్రెష్‌గా ఉన్న పూజనే చూస్తుండిపోయాడు. అప్పుడే నిద్ర లేచినట్లుంది. చెదిరిన ఆ జుట్టు ముఖం మీద పడి ఎంతో అందంగా ఉంది. నీలిరంగు నైటీ ఆమె అందాలను దాచలేకపోతూంది.

"ఏం.. ఏం... కావాలి?" అని మరోసారి గద్దించింది పూజ.

అతను తడబడుతూ అటూ, యిటూ చూశాడు, గేటు మీద 'ఆశా.. స్పోకెన్ ఇంగ్లీషు సెంటర్' అని రాసిన బోర్డు అగుపడింది.



# ఇదీ.. ప్రేమంటే...!

లంకపల్లి సంపత్‌కుమార్

ఏదో ఐడియా మెదిలి, "అదే... ఇంగ్లీషు నేర్చుకోవాలనీ.." అన్నాడు తడబడుతూ.

"ఇంత పొద్దున్నా? వేళా పాళా లేదా?" అంది విసుగ్గా.

"టైమింగ్స్ ఏదైనా రాసి వుందా అని చూస్తున్నాను" అన్నాడు అతను నవ్వుతూ.

వెధవ నవ్వొకటి అనుకొని, "సరే! లోనికి రండి" అని, ఆ యింటి కాంపౌండులోనే మూలగా వున్న రేకుల గదిని చూపించి, "అక్కడ కూర్చోండి" అని వెళ్లిపోయింది.

రైటింగ్ పాడ్స్ వున్న కుర్చీలను చూసేసరికల్లా అర్థం అయ్యింది, అది క్లాస్ రూమ్ అని. టేబుల్ పక్కగా ఓ ప్రొజెక్టర్ వుంది. గోడలకు అందంగా అతికించిన ఇంగ్లీషు సామెతలున్నాయి. వాటిని చదువుతూ కూర్చుండిపోయాడు.

"నీకు ఇంగ్లీషు నేర్చుకోవడం అంత అవసరమా?" అంది లోనికి వస్తూనే.

"ఆ అవును. అవునండీ. ఏ జాబ్ చేయాలన్నా ఇంగ్లీషు అవసరం లేదా?" అన్నాడు, అదోలా నవ్వుతూ.

మరోసారి 'ఫూల్...' అనుకొని. "ఇంగ్లీషు నేర్చుకోవడం.. జాబ్ కొరకేనన్నమాట?" అంది కుర్చీలో కూర్చుంటూ.

కాస్త ఫ్రెష్ అయి వచ్చినట్టుంది. నైటీ మీద చున్నీ వేసుకుంది. ఆమెనే గమనిస్తూ, 'జాబ్ కొరకు కాకపోతే, ఇంగ్లీషు ఎందుకు?' అనబోయి, "ఇంగ్లీషు అంటే నాకుప్రాణం. నేర్చుకోవాలనీ, మాట్లాడాలనీ ఎంతో 'యిది'గా వుంది" అన్నాడు.

"నేను రెండు బ్యాచ్‌లను నడిపిస్తున్నాను. ఉదయం ఒకటి, సాయంత్రం మరొకటి. ఉదయమూ, సాయంత్రమూ ఆరు గంటలకు ప్రారంభం అవుతుంది. రెండూ, రెండున్నర గంటల వరకూ ఉంటుంది. నేను చాలా స్ట్రిక్ట్ డబ్బు దగ్గరా, నేర్చుకునే దగ్గరా. సీరియస్‌గా నేర్చుకుంటానంటే చేరండి. ఏదో సరదాగా అంటే.. వద్దు!"

"నాకు డ్యూటీలు కొన్నిసార్లు వేరుగా ఉంటాయి. కొన్ని రోజులు మిస్సయినా, ఎలాగోలా మిగతా స్టూడెంట్స్ దగ్గర నోట్సు రాసుకుంటాను. మీకిష్టమైతేనే చేరతాను. నాకు ఇంగ్లీషు నేర్చుకోవాలనే ఆశ.." అన్నాడు, ముఖం దీనంగా పెట్టుకొని.

పూజ కొంచెం సేపు ఆలోచించి, "సరే" అని, అప్లికేషన్ అందించింది. ఫీజు వివరాలు చెప్పి, "ఒక్కసారే చెల్లించా"లంది.

"నా పేరు సునీల్" అంటూ పరిచయం చేసుకున్నాడు. అప్లికేషన్ నింపి యిచ్చాడు. "ఏం ఉద్యోగం చేస్తారో రాయలేదు. అడ్రస్ లేదు. ఫోన్ లేదా సెల్ నంబర్ యివ్వలేదు" అంది.

"కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తున్నాను మేడమ్. అడ్రస్ అదీ కనుక్కొని యిస్తాను. మా కాంట్రాక్టర్ ఎక్కడికి వెళ్లమంటే, అక్కడికి వెళతాను. అక్కడే మకాం" అని, ఫీజు డబ్బు చెల్లించాడు.

"కోర్సు ఆరు నెలలుంటుంది. స్టడీ మెటీరియల్, నోట్సులుంటా"యని అన్ని వివరాలూ తెలిపింది.

"నేను రేపట్నుంచి వస్తాను మేడమ్" అని వెళ్లబోతూ "మీరు ఏమీ అనుకోకపోతే.. మీ... పేరు... తెలుసుకోవచ్చా మేడమ్?" అన్నాడు చిలిపిగా నవ్వుతూ.

"పేరెందుకు? మేడమ్ అంటున్నావుగా, అలాగే పిలువు!" అంది ఫీజుకు 'బిల్' రాసి యిస్తూ.

"ఏ మేడమ్ అని పిలవాలి? మీ పేరేమైనా సుబ్బులక్ష్మి, సత్తెమ్మా, అనసూయా? ఐతే వద్దు లెండి. మేడమ్ అనే పిలుస్తాను" అన్నాడు నవ్వుతూ.

ఇదో వెకిలి నవ్వు. "ఏ పేరైనతేనేం? మేడమ్ అని పిలిస్తే చాలు!" అంది కోపంగా.

"సరే మేడమ్. రేపు క్లాసుకు వస్తాను" అని వెళ్లిపోయాడు.

000

సెల్ ఫోన్ మోగింది. ఎవరో అని చూసింది... సుమ.

"చెప్పు.. ఏమిటే ఇంత పొద్దున్నే..?" అంది పూజ.

"నీవు నిద్ర లేచావో లేదో కనుక్కోవాలని! ఏ రాజకుమారుడైనా కలలోకి వచ్చాడేమోనని!" అంది సుమ.

"చాల్లే ఎప్పుడూ నీకు 'ప్రేమ' ధ్యాసే. మరింకేమీ ఉండదు. అంతగా యిష్టం ఉన్నదానివి ఎవరినైనా ప్రేమించలేకపోయావా?" అంది.

"అదేనే.. చాలా కష్టపడుతున్నాను. ఏ వెర్రిబాగులవాడైనా దొరికితే.. లవ్ అంటూ వాణ్ని నా వెనక తిప్పుకోవాలనుకుంటున్నాను. సరదాలకూ. షికారులకూ ఒకడు, ప్రెజెంటేషన్స్ యిచ్చేందుకు మరొకడు, ఎవరూ దొరక్కపోతే.. ఏ పాలవాడినో, పేపర్ బోయ్‌నో ప్రేమించాలనే ఉంది" అంది సుమ నవ్వుతూ.

"అదేనే.. చాలా కష్టపడుతున్నాను. ఏ వెర్రిబాగులవాడైనా దొరికితే.. లవ్ అంటూ వాణ్ని నా వెనక తిప్పుకోవాలనుకుంటున్నాను. సరదాలకూ. షికారులకూ ఒకడు, ప్రెజెంటేషన్స్ యిచ్చేందుకు మరొకడు, ఎవరూ దొరక్కపోతే.. ఏ పాలవాడినో, పేపర్ బోయ్‌నో ప్రేమించాలనే ఉంది" అంది సుమ నవ్వుతూ.

"చాల్లే... ఎప్పుడూ యిదేగా చెప్పేది? నీకు ప్రేమ ధ్యాస తప్ప మరేమీ ఉండదు" అంది పూజ.

"అవునోయ్. నీకేమో ప్రేమలూ, దోమలూ పడవు. బి.యిడి. కాలేజీలో దయతలచి, మీ నాన్నగారి ఫ్రెండ్ ప్రిన్సిపాల్ ఇంగ్లీషు మెథడాలజీ చెప్పమని ఉద్యోగం యిస్తే.. షిట్! ఈ స్టూడెంట్స్‌కు అస్సలు బుద్ధి లేదు. ఆ చెట్టపట్టాలేమిటి? ఇంత క్లోజ్‌గా ఉంటారా? అని కోపంతో ఉద్యోగం వదిలేశావ్. వాళ్లేదో ప్రేమించుకుంటే నీకెందుకు అంత మంట?" అంది సుమ, 'మంట' అనే మాట 'ఒత్తి' పలుకుతూ.

మరో ఉద్యోగం వచ్చేవరకు యింటి ఆవరణలోని షెడ్‌లో స్పోకెన్ ఇంగ్లీషు క్లాసులు ప్రారంభించింది పూజ.

"ప్రేమ అంటే..." అని ఇంకా ఏదో సుమ అనబోగా, "ఇది యిప్పుడంత అవసరమా? ఇది చెప్పడానికే ఫోన్ చేశావా? డబ్బు దండగ!" అంది పూజ.

"ఫ్రెండ్ నంబర్ కదా... పది పైసలే కదా పోయేది. ఓ అరగంటైనా మాట్లాడకపోతే తృప్తి ఉండదు. మీ డాడీ నాగార్జునసాగర్ డామ్ డివిజన్‌లో ఎం.ఏ. చేశావ్.. ఎం.ఫిల్. అయ్యింది. ఓ సరదా లేదు. ఫైర్ బ్రాండువి. ప్రేమ లేకుండా.. ఆ థ్రిల్ లేకుండా ఎలా జీవిస్తున్నావే అసలు?" అంది సుమ.

"సర్లే ఏమిటో చెప్పి ఏడువు!" అంది పూజ విసుగ్గా.

"ఫోన్‌లో ఏం చెప్పేది? వచ్చి కలుస్తానులే!" అని ఫోన్ పెట్టేసింది.

000

ఇంగ్లీషు కోచింగ్ క్లాసులు జరుగుతున్నాయి.

సునీల్ కిటికీ పక్కనే కూర్చుంటాడు. పూజ పాఠాలు చెప్తూవుంటే ఆమెనే గమనిస్తూ ఉంటాడు. అతని వైపు చూడగానే కిటికీ గుండా బయటకు చూస్తుంటాడు. 'అదో వెధవ పోజు!' అనుకుంటుంది. ఆ బ్యాచ్‌లోని మిగతా స్టూడెంట్స్‌కు అతనంటే చాలా యిష్టం. రెగ్యులర్‌గా రాడు. ఓ రోజు కేకలేసేసరికి, "ముందుగానే చెప్పానుగా మేడమ్...!" అంటూ బతిమాలాడు. "నాకు డ్యూటీలు కుదరనప్పుడు రాలేను. నోట్సు మిగతా స్టూడెంట్స్ దగ్గర్నుంచి రాసుకుంటాను" అన్నాడు. అతని హ్యాండ్ రైటింగ్ చాలా బాగుండటం పూజ దృష్టిని ఆకర్షించింది.

హోమ్ వర్క్ యిస్తే, అన్నీ తప్పులే. "ఇదేంటి?" అని అడిగితే, "నాకు కాంపోజిషన్ రాకనే కదా వచ్చేది మీ దగ్గరకు?" అంటాడు. అతను క్లాసులో ఉంటే అంతా సరదాగా ఉంటుంది. ఏదో ఒక జోక్ చెప్పి అందరినీ నవ్విస్తుంటాడు.

ఎందుకో.. అందరికీ కొరికట్టుగా అతన్ని కసురలేకపోవడం ఆమె బలహీనతగా మారింది. పూజ ఎప్పుడూ కాటన్ పంజాబీ సూట్స్ వేసుకుంటుంది. ఆ రోజు.. నీలిరంగు శారీ కట్టుకొంది. అందరూ "మీరు 'శారీ'లో బాగున్నారు మేడమ్!" అన్నారు. సునీల్ చూపులన్నీ తన వైపే ఉండటం గమనించింది.

"ఏయ్, సునీల్! బ్యూటిఫుల్ అనే మాటతో ఓ సెంటెన్స్ చెప్పు!" అంది, అతన్ని గదమాయిస్తూ.

"నిజంగా చెప్పమంటారా?" అన్నాడు ముఖం అమాయకంగా పెట్టి.

"ఎస్" అంది పూజ.

"అవర్ మేడమ్ ఈజ్ బ్యూటిఫుల్ యిన్ శారీ" అన్నాడు.

అందరూ "భలే...!" అంటూ చప్పట్లు కొట్టారు.

పూజకు సిగ్గేసింది. అతనలా అనేసరికి తెల్లబోయింది.

"మరో వాక్యం చెప్పమంటారా మేడమ్?" అన్నాడు, చిన్నపిల్లవాడిలా చేతులు కట్టుకుని.

"ఓ.. కే.." అనేసి, మరో టాపిక్‌లోకి వెళ్లింది.

అతను కొన్నిసార్లు సాయంకాలాలు వచ్చేవాడు.

"ఏంటి కథ? అందరినీ వదిలి స్పెషల్ కోచింగ్ యిస్తున్నట్టున్నావ్?" అంది సుమ, ఒక రోజు.

'పూజ ఈ మధ్య మారిపోయింది' అనుకుంది పూజ తల్లి. బట్టలు అన్నా, అలంకరణ అన్నా ఏ మాత్రం యిష్టం కనబరచని పూజ, ఎంతో శ్రద్ధగా తయారవడం గమనించింది. గోరింటాకు అంటేనే విసుక్కునే పూజ, తీరిగ్గా గోరింటాకు పెట్టుకోవడం ఆమెను ఆశ్చర్యపరిచింది.

ఓ రోజు చాలాముందుగానే వచ్చాడు సునీల్. అప్పుడు మరో అమ్మాయి వచ్చింది క్లాసుకు. వారిద్దరూ పక్కపక్కనే కూర్చుని మాట్లాడుకోవడం చూసింది.

"మీరు మా యింటికి రండి. మంచి భోజనం వండి పెడతాను. నాగార్జునసాగర్ కదా. ఫిష్ బాగా దొరుకుతాయి" అంది ఆ అమ్మాయి.

"నీవే అందంగా ఉన్నావు.. ఇంక నీ వంట ఎంత బాగుం

టుందో...?" అనేసరికి, ఆ అమ్మాయి బోలెడు సిగ్గుపడటం చూసింది పూజ.

"అందంగా అంటే.. పూజా మేడమ్ అంతనా..?" అంది సిగ్గుగా.

సునీల్ సైలెంట్ అయిపోయాడు. లోనికి రాబోతూ ఆ మాటలు విన్న పూజ, అక్కడే నిలబడిపోయింది, అతను ఏమి చెప్తాడో వినాలని.

ఎందుకో అటు చూసిన సునీల్, పూజ నిలబడటం గమనించి చెలరేగిపోయాడు. "నీకో విషయం చెప్పనా?" అన్నాడు ముందుకు జరిగి.

"చెప్పండి సార్" అంది ఆ అమ్మాయి.

"పూజా మేడమ్ అందమైన అమ్మాయే. బాపు గీచిన బొమ్మే. అడవి బాపిరాజు వర్ణించిన కతారికత్తే. కానీ.. కాస్త పొగరెక్కిన తింగరి బుచ్చి" అన్నాడు. ఇద్దరూ పెద్దగా నవ్వుకున్నారు.

ఒంటికి కారం పూసినట్టయ్యింది. ఏమనుకుంటున్నాడు తనని? యూనివర్శిటీలోనే ఎవర్నీ తన జోలికి రానీయలేదు. తానంటేనే ఫైర్ బ్రాండ్. ఎవ్వరూ తనను సమీపించాలని ప్రయత్నించడానికి సాహసం చేయలేదు. ఇతగాడెంత? ఆమె ముఖం కందిపోయింది కోపంతో.

ఆ రోజు క్లాసులో చాలా సీరియస్‌గా వుంది.

"మీ పెన్ యిస్తారా మేడమ్?" అడిగాడు సునీల్.

"పెన్ కూడా తీసుకురాకుండా క్లాసుకు రావొద్దని చెప్పానుగా?" అంది కోపంగా.

"మీ పెన్ బాగా రాస్తుంది మేడమ్.. అని ఏదో అతను మాట్లాడబోతుంటే, "వ్వాట్ నాన్సెన్స్ యు ఆర్ టాకింగ్? మైండ్ యువర్ టంగ్!" అని కోపంగా అరిచి, ఇంట్లోకి వెళ్లిపోయింది.

అతను రావడం మానేశాడు. సరేలే.. అనుకుంది. వారం గడిచినా అతను రాలేదు. క్లాసంతా వెలితిగా అనిపించసాగింది. మోటార్ బైక్ శబ్దం కొరకు చెవులు రిక్కించి వినేది. ఆమె పరధ్యానం చూసి, "సునీల్ రాడండీ. క్లాసు ప్రారంభించండి" అనేవారు.



తానేమంది అతన్ని? అలా మాట్లాడొచ్చా? అంత మాత్రాన క్లాసుకు రావడం మానెయ్యాలా? కిటికీ పక్కన ఖాళీ కుర్చీ వెక్కిరించినట్టుగా ఉంది. ఏదో పోగొట్టుకున్న ఫీలింగ్.

"నేనేమన్నానని? అందరి ముందూ అలా అంటాడా?" అంది సుమతో, ఒక రోజు.

"ఏదీ? మరోమారు ఆ స్టేట్‌మెంట్ 'రీ.. ప్లే..' చేయి" అంది సుమ.

కోపంతో మళ్లీ అదే అంది పూజ.

"అందరి ముందూ అంటే బాగోలేదా? ఒంటరిగా అంటే, బాగుంటుందన్నమాట!" అంది సుమ.

"ఏదో ఇంగ్లీషు నేర్చుకుంటాడనుకున్నాను. కానీ ఇలా బిహేవ్ చేస్తాడనుకోలేదు" అంది పూజ.

"అలాగా... నాకు తెలీదులే...!" చిలిపిగా నవ్వింది సుమ.

000

కృష్ణానది పాయ.. నాగావంక పొంగిపొర్లి... డెబ్బయి అడుగుల ఎత్తు నుండి కింద లోయలోకి జాలువారే దృశ్యం అందంగా ఉంది. నాగార్జునసాగర్‌కు 10 కిలో మీటర్ల దూరంలో ఉంది, ఎత్తిపోతల జలపాతం. మనస్సు బాగోలేదండీ, సుమ, పూజను ఒప్పించి తీసుకువచ్చింది. 'వ్యూ పాయింట్' దగ్గర ఫొటో దిగుతున్నారు.

"అదిగో.. సునీల్!" అంటూ అరిచింది పూజ.

ఆశ్చర్యంగా ఆమెనే చూసింది సుమ.

వద్దన్నా వినకుండా, టూరిస్ట్‌ల మధ్య నుండి పరుగుతీసింది పూజ అతన్ని పట్టుకోవాలని.

ఆమెనే అనుసరిస్తూ వెళ్లింది సుమ.

ఎవరితోనో మాట్లాడుతున్న అతని దగ్గరకు వెళ్లి, "ఏయ్ మిస్టర్! క్లాసుకు ఎందుకు రావడంలేదు?" అంది పూజ.

అతను వెనకకు తిరిగి చూసి, ఆశ్చర్యపోయి సర్దుకున్నాడు. "మేడమ్ గారు క్లాస్ రూమ్ వదిలి, అందమైన లొకేషన్‌కు వచ్చారేమిటీ?" అన్నాడు చిలిపిగా నవ్వుతూ.

"ఐ వాంట్ యూ టు బి ఇన్ ద క్లాస్ బై టుమారో!" అంది పూజ ఆవేశంగా.

అప్పుడు గమనించింది సుమ... అక్కడే పెద్ద టెంటులు వేసి ఉన్నాయి. 'ఇంజినీర్స్ మీట్' అనే ప్రోగ్రామ్ ఏర్పాట్లున్నాయి.

"డివిజనల్ ఇంజనీర్ సునీల్ గారిని మాట్లాడవలసిందిగా కోరుతున్నాం" అనే అనౌన్స్‌మెంట్ వినబడడంతో, సునీల్, పూజ వైపు తిరిగి, "మళ్లీ వస్తా" అంటూ వెళ్లిపోయాడు.

అతని ప్రసంగం స్వచ్ఛమైన ఇంగ్లీషులో సాగింది. ఆశ్చర్యపోయింది పూజ.

000

ఉదయాన్నే కొరియర్ మోసుకొచ్చాడు. అందమైన పూల బొకే. దానికి చిన్న స్లిప్ ఉంది. అందులో "మేడమ్ కోపం తెచ్చుకోవద్దు. ఆ రోజు మా కొలీగ్ యింటిని వెతుకుతూ ఇంటి నంబర్ చూస్తుంటే, మీరు కంగారు పెట్టారు. మిమ్మల్ని చూశాక, సరదాకని ఆట పట్టించాలనుకున్నాను. మీ గేటు మీద ఉన్న 'స్పోకెన్ ఇంగ్లీషు' బోర్డు చూసి, ఆటపట్టించాను. మీ కోచింగ్ నచ్చింది. మీరూ నచ్చారు. మీకిష్టమైతే, రేపు ఉదయాన్నే నాకిష్టమైన బ్లూ కలర్ శారీలో బాల్కనీలో నిలబడండి. లేదంటే, మీకిష్టం లేదనుకొని వెళ్లిపోతాను. నీ సునీల్" అని ఉంది.

రాత్రంతా బ్లూ శారీని ఐరన్ చేసి నానా తంటాలూ పడుతున్న కూతుర్ని చూసి నవ్వుకుంది, పూజ తల్లి.

అప్పటికే విషయమంతా ఫోన్‌లో సుమ చెప్పేసింది. 'పిచ్చిపిల్ల! ప్రేమ వచ్చినా ఆగదు. కోపం వచ్చినా ఓర్చుకోలేదు' అనుకుంది.